# అభయహస్తం

**- శైల**



ఆ ప్రదేశమంతా రద్దీగా వుంది. పళ్ళు, బిస్కెట్లు, సోడాలు, మేగజీన్స్ అమ్మేవాళ్ళు, ఆలస్యంగా వచ్చి బండి అందదేమోనన్న కంగారులో పరుగులు తీస్తున్న ప్రయాణీకులతో 'ప్లాట్‌ఫాం' కిటకిట లాడుతోంది. ఆ రద్దీతో తనకేం సంబంధంలేనట్లు, ఆగివున్న ట్రైన్‌లో కిటికీవైపు సీటులో కూర్చుని మేగజీన్ తిరగేస్తోందో అమ్మాయి. "అమ్మాయి గారూ! ఇవుగోనండీ జాంకాయలు. ఈడేడా లేవండీ, బయటికెల్లి తెచ్చాను" అంటూ తాటాకు బుట్ట అనితకు అందించాడు కొండయ్య.

"ఇక నువ్వెళ్ళు కొండా. నానమ్మ నీ కోసం ఎదురుచూస్తూంటుంది" అని అంటూండగానే రైలు కదిలింది. దణ్ణంపెట్టి, శెలవు తీస్కుని వెళ్ళి పోయాడు కొండయ్య.



రైలు మెల్లిగా వేగాన్ని పుంజుకుంది. రైలు వంతెనమీదకు రాగానే, దూరంగా గోదారి అవలి ఒడ్డున, లీలామాత్రంగా తెల్లటి గోపురం కనిపించగానే తెలియని దుఃఖం కలిగింది అనితకు. రెండు నెలలు. తన వూరూ, కాలేజీ, డిన్నర్‌లు, డిస్కోలు, ఇవన్నీ ఒదిలి రెండు నెలలు, కనీసం సినిమా హాలు కూడా లేని వూళ్లో వుంది! దానికంటే కూడా ఈ వూరికి వచ్చే ముందు తన శారీరక, మానసిక పరిస్థితి, ఇప్పుడున్న పరిస్థితికి పోల్చుకుంటే. "ఓహ్", తనలోని నిరాశా, నిస్పృహల్ని తీసేసి, చైతన్యం, స్పందన ముఖ్యంగా జీవితంపట్ల మమకారం నింపిన ఆ వూరు, ఆ మనుషులు, ముఖ్యంగా నానమ్మ.. అనిత ఆలోచనలు సరిగ్గా రెండు నెలలువెనక్కి పరుగులు తీశాయి.

• • •

ప్రసాదరావు, ప్రమీలల ఏకైక సంతానం అనిత. డాక్టరుగా మంచి పలుకుబడితోపాటు, నగరంలో ముఖ్యమైన సంస్థలలో ఏదో ఒక పదవినలంక రించటంతో ఎప్పుడూ ఒక్క నిముషం తీరికలేనట్లుగా వుంటాడు ప్రసాదరావు. అయనకి తగ్గట్టుగానే ప్రమీల మహిళామండలి ప్రెసిడెంటు. కిట్టీపార్టీలు, డిన్నర్‌లు, క్లబ్బు- వీటితో ఆవిడ ఎప్పుడూ బిజీనే. కనీసం రెండు రోజులకొకసార యినా ఆ ఇంట్లో పార్టీ ఏర్పాట్లు జరుగుతూంటాయి. కాలేజీలో చదువుతున్న వారి కుమార్తె అనితకు ఆ వాతావరణం చిన్నప్పటి నుంచీ అల వాటే. ఎప్పుడో వీలున్నప్పుడు తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు హఠాత్తుగా ఆ పిల్ల చదువు గురించి, ప్రవర్తన గురించి ప్రశ్నలేసి మొక్కుబడి తీర్చుకునే వాళ్ళు. అలా అని వాళ్ళు ఆ పిల్లకి తక్కువేమీ చెయ్యలేదు. నచ్చిన డ్రెస్సు, నగల్లా కొనేవారు. అడిగినంత పాకెట్ మనీ ఇచ్చే వారు. కానీ కాస్త వయసు వచ్చాక ఆ యింట్లో తనేదో పొందలేక పోతున్నానని అనితకు అనిపించినా, మరో కొత్త నగో, డ్రస్సో ఆ ఫీలింగని కాంపన్‌సేట్ చేసేసేది. ఎప్పుడూ లేటెస్ట్ ఫ్యాషన్లో, కాలేజికి కార్లో వచ్చే అనితకి చుట్టూ భజన పరులకుగానీ, ఆరాధకు లకుగానీ కొదవలేదు. చదువు మీదకంటే కూడా, కొత్తగా రిలీజయిన సినిమాలతోపాటు ఇన్‌ఫాట్యు యేషన్ (వాళ్ళ దృష్టిలో ప్రేమ) వాళ్ళ మెయిన్ సబ్జక్ట్సు. ఆ వయసులో వాళ్ళకి కాలేజీ లైఫ్ ఎంతో అద్భుతంగా, థ్రిల్లింగ్‌గా కనిపించింది. పిక్నిక్కు లని, లేట్‌నైట్ డిన్నర్‌లనీ, డిస్కోలని వాళ్ళ ఎంజాయ్‌మెంట్‌కి అంతే వుండేదిగాదు. ఇక స్ట్రైకుల్లాంటివి జరిగితే, వాటికీ వీళ్ళే ముందుండే వాళ్ళు. కారణాలేవయినా వీళ్ళకదో ఎంజాయ్ మెంట్. జీవితంలో అన్ని వసతులూ వుండి, దేనికీ లోటు లేకుండా, భవిష్యత్తు గురించి చింత లేకుండా వున్నప్పుడు ప్రతి ఒక్కరూ అవతలి మనిషి సమస్యలకు సలహా లిచ్చి, తనైతే ఎలా వాటిని డీల్ చేస్తారో ఉదాహరణలతో చెప్తారు. సమస్యలు చుట్టు ముట్టి నప్పుడే మనుష్యుల అసలైన వ్యక్తిత్వం బయట పడేది.

ఆ రోజు ఏదో పార్టీ వుందని, లేటుగా వస్తానని ఇంట్లో చెప్పి స్కూటర్ మీద వెళ్ళింది అనిత. రాత్రి

పది గంటలకు ఇంటి కొచ్చిన తల్లిదండ్రులకు అదేమంత కంగారు పడాల్సిన విషయంగా తోచలేదు. లేటుగా రావటం, ఒక్కోసారి ఏ స్నేహితురాలి ఇంట్లోనో వుండిపోయి, మర్నాడు ఉదయం ఇంటికి రావడం అనితకు మామూలే. కానీ రాత్రి ఒంటిగంట ప్రాంతంలో అనిత ఫ్రెండ్ రజని ఫోన్ కాల్తో క్షణాల్లో నిద్రమత్తు ఒదిలిపోయింది ప్రసాదరావుకి, ప్రమీలకి.

"అంకుల్ అనిత ఇంటికొచ్చేసిందా? రాగానే ఫోన్ చేస్తానంది. మా ఇంట్లోనే పడుకోమంటే, రేపు టెన్నిస్ క్లాసుందని ఒంటరిగా బయల్దేరింది" ఆ మాటలతో గుండెలవిసిపోయాయి వాళ్ళిద్దరికీ. వెంటనే కారు తీస్కుని బయల్దేరారు. అనితను కనుక్కోవటం పెద్ద కష్టమేమీ కాలేదు. రజని ఇంటికీ వీళ్ళింటికీ దగ్గరగా వున్న ఓ ప్లేగ్రౌండ్ ముందు అనిత స్కూటర్ పడి వుంది. కాస్త వెత్తగ్గా లోపల ఓ చెట్టుచాటున అపస్మారకంలో, అస్తవ్యస్తంగా అనిత!

• • •

రోజూ పేపర్లలో ఎక్కడో ఒకచోట కనపడే 'అత్యాచారం' అనే వార్త తమ కూతురి జీవితానికి ఎగ్రసిరాతో బాక్సు కడుతుందని ఆ తల్లిదండ్రులు అనుకోలేదు. ప్రసాదరావు డాక్టరు కాబట్టి ఈ విషయం బయటికి పొక్కకుండా జాగ్రత్త తీసుకున్నాడు. హస్పటల్లో తెలివి వచ్చిన అనిత ఏడ డిగినా ఏడవటం తప్పించి ఏ విషయం చెప్పలేదు. కానీ డాక్టరైన ప్రసాదరావుకు మటుకు ఆ రాత్రి తెలివి తప్పి పడివున్న అనితని చూడగానే సంగతంతా అర్థమయిపోయింది. ఎలా ఇప్పుడు అనితని మామూలు మనిషిని చెయ్యటం? ప్రసాదరావుకి భార్య మీద విపరీతమైన కోపమొచ్చింది. ఇక ఒకరిపై ఒకరు 'నీ వల్లనే ఇదంతా జరిగింద'ని నిందలు మోపుకోవటం అరంభించారు. అనిత ఈ సంఘటన మామూలుగా తీస్కుని వుంటే బహుశా వాళ్ళింత గింజుకునేవారు కారేమో. ఆ పిల్ల జరిగిన ఘోరాన్ని తల్చుకుని తల్చుకుని భయపడిపోతోంది. ఎంత అల్లరి చిల్లరిగా, తిరిగినా ఏ మగవాడ్నీ ఆమె ఒంటి మీద చెయ్యి వెయ్యనిచ్చేది కాదు. అలాంటిది ఎవడో కూడా తెలీని ఒక వ్యక్తి.. ఆ పిల్ల తట్టుకోలేకపోతోంది. దానికి తోడు తల్లిదండ్రుల పోట్లాటలు ఆ అమ్మాయిని మరీ కృంగదీశాయి. ధైర్యం చెప్పవలసినవాళ్ళే ఇతరుల సానుభూతి కోసం పోట్లాడుకుంటూంటే ఎటూ తోచక, విసిగి పోయి అనిత స్లీపింగ్ పిల్స్ మింగేసింది.

ఆ పిల్లను గండం నుంచి బయటపడేసేటప్పటికి ప్రసాదరావు బాగా డిప్రెస్ అయిపోయాడు. ప్రమీల తన బాధను మాటలద్వారానో, చేతలద్వారానో బయటికి చూపించేసేది. కానీ ప్రసాదరావుకు ఈ బాధను ఎవరితో పంచుకోవాలో తెలియలేదు. అప్పుడే అతనికి తల్లి గుర్తుకొచ్చింది. ఎటువంటి సమస్య వచ్చినా నిబ్బరంగా ఎదుర్కునే అవిడ గుర్తుకు రాగానే గిల్టీగా కూడా ఫీలయ్యాడు. ఆమెని చూసి దాదాపు సంవత్సరం కావస్తోంది. తను రాసినా రాయకపోయినా పది రోజులకొకసారి అవిడ ఉత్తరం రాస్తుంది. అవిడను వచ్చి తన దగ్గరే వుండమంటే "ఒద్దులే ప్రసాదూ. ఓపిక ఉన్నంతవరకూ ఈ ఊళ్ళోనే వుండనీ. ఆ తరువాత నీ దగ్గర కాకపోతే ఎక్కడుంటాను" అంటూ సున్నితంగా తోసిపుచ్చింది. అవిడకు తెలుసు, తన పద్ధతులకు, ప్రమీల పద్ధతులకు చాలా వ్యత్యాసం వుందని. ఒకేచోట వుండి మనస్పర్థలు పెంచుకునే కంటే దూరంగా వుండి మర్యాద కాపాడుకోవటం మేలని అవిడ వాళ్ళ పెళ్ళయిన కొత్తల్లోనే గ్రహించింది. ఒక్కగానొక్క కొడుకుమీద ఎన్నో ఆశలు పెంచుకుంది కామేశ్వరమ్మ చిన్నప్పుడే భర్త చనిపోతే, బంధువుల బారి నుండి ఆస్తిని కాపాడి, కొడుకుని కష్టపడి పెంచి పెద్దవాడ్ని చేసింది. అలాంటిది, కొడుకు చెప్పకుండా చేస్కున్న 'లవ్ మేరేజ్' అవిడ ఆశలకు గొడ్డలి పెట్టులా తాకింది. కానీ పెద్దరికం, వ్యక్తిత్వం మూర్తీభవించిన కామేశ్వరమ్మ ఎంతో గంభీరంగా వ్యవహరించి, అప్యాయతతో ఆ దంపతులను ఆదరించింది. ఎందుకోగానీ ప్రమీల మొదటి నుంచీ అవిడకు దగ్గరకాలేకపోయింది.



బంగారు నగలు తళతళామెరవాలంటే కావాలనుకున్నప్పుడు పంచదార నీళ్ళలో నానబెట్టి, బ్రష్ చేస్తే ఎంతో షైనింగ్ వస్తాయి.

పుట్టతేనె దొరికినపుడు నిల్వచేసుకోవాలనుకుంటే, గోరువెచ్చగా వేడి చేసి, దాంట్లో రెండు లవంగాలు వేస్తే, చెడిపోకుండా నిల్వ వుంటుంది. ఔషధసేవకు ఎంతో మంచిది కూడా.

–మల్లిడి నాగమల్లీశ్వరి

కారణం ప్రసాదరావుకు తల్లి మీదుండే గౌరవం కావచ్చు. మొదట్లోనే ఇదంతా గ్రహించిన ప్రమీల తెలివిగా భర్తని అవిణ్ణుంచి దూరం చేసి వేరు కాపురం పెట్టింది. కామేశ్వరమ్మనయితే దూరం చేసిందిగానీ ప్రసాదరావుకి అవిడ మీదుండే గౌరవాన్ని, ప్రేమని దూరం చెయ్యలేకపోయింది.

ప్రసాదరావు అనిత గురించి తల్లికి తెలియజేశాడు. అవిడ వెంటనే అనితని తీసుకొని, అతన్ని తన దగ్గరకు రమ్మని రాసింది. ప్రసాదరావు తీసుకున్న ఈ నిర్ణయం భార్యభర్తల మధ్య పెద్ద ఘర్షణకి దారి తీసింది. చివరకు అనితకు నచ్చచెప్పి ప్రసాదరావు అనితను తీస్కుని తల్లి దగ్గరకు బయల్దేరాడు.

• • •

"ఇదిగో కొండా- ఇహ బాబుగారూ వాళ్ళు వచ్చే టైమయ్యింది. వేణ్ణీళ్ళు కాగాయో లేదో చూడు." అంటూ పన్ను పురమాయించి, వాకిట్లో కొచ్చి నుంచుంది కామేశ్వరమ్మ తెల్లని నేత చీర, జాకెట్టు, మెళ్లో పగడాల దండ, చేతికి రెండేసి బంగారు గాజులు, నెరిసిన తల నున్నగా దువ్వి బిగించిన ముడి. అరవయ్యేళ్ళు దాటినా హుషారుగా ఇప్పటికీ ఇంటి పని అవిడే చేస్కుంటుంది. ఆ వూళ్ళో అందరికీ ఏ కష్టమొచ్చినా, సుఖమొచ్చినా అవిడే పెద్ద దిక్కు. వాకిట్లోకి కారొచ్చి ఆగింది. గుమ్మంలో తమ కోసం ఎదురు చూస్తున్న తల్లిని చూడగానే ప్రసాదరావుకి అప్రయత్నంగా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. పదేళ్ళ వయసులో తన తండ్రి చనిపోతే కష్టాలను తట్టుకుని, శిఖరంలా నిలబడి తననింతవాడ్ని చేసిన 'అమ్మ'. అనితని అప్యాయంగా పొదివి పట్టుకుని లోపలికి తీస్కెళుతున్న తల్లిని చూస్తే ప్రసాదరావుకు నిశ్చింతగా అనిపించింది. చిక్కిపోయి, కళ్ళ చుట్టూ నీడలతో దైన్యంగా ఉన్న అనితని చూస్తే కామేశ్వరమ్మ కడుపు తరుక్కుపోయింది. కొడుకూ కోడలు మీద కోపం ముంచు కొచ్చింది. కానీ వివేకం అవిణ్ణి హెచ్చరించింది. ఇది కోపతాపాలకు సమయం కాదు. ముందు అనితని మామూలు మనిషిని చెయ్యాలి.

తల్లిచేతి భోజనం, ఎనిమిది గంటలకే సద్దుమణిగిన ఊరు, ప్రశాంతంగా వున్న పరిసరాలు, ప్రసాదరావుకు సగం దిగులు తీరినట్టుగా వుంది. అనిత ఎంత బతిమిలాడినా భోజనం చెయ్యలేదు. పాలు మటుకు తాగి పడుకుంది. తెల్లటి వెన్నెల వాకిలంతా పరుచుకుంది. గుమ్మానికి కట్టిన మామిడాకులు వాడి ఒరుగుల్లై గాలికి కదిలి వింత చప్పుడు చేస్తున్నాయి. తల్లి రావడం చూసి మంచం మీద పడుకుని ఉన్న ప్రసాదరావులేచి కూర్చున్నాడు. మంచినీళ్ళ చెంబు మంచం పక్కన పెట్టి అరుగుమీద కూర్చుంది కామేశ్వరమ్మ

"ప్రసాదూ! జరిగినదాన్ని గురించి ఇక అలోచించటం మానేయండి. జరగవలసినదేమిటో అది ఆలోచించండి. అనితకు ఎంతో భవిష్యత్తు వుంది. ఈ సంఘటనతో బెదిరిపోయి జీవితం మీద నిరాశ పెంచుకుంది. ఇందులో తన తప్పేమీలేదని నచ్చ చెప్పి, తనలో నుంచి తప్పు చేశానానేమోనన్న భావన పోగొట్టాలి. ముందు నువ్వు ధైర్యంగా వుండాలి. ఇప్పుడు అనితకి కావల్సింది జాలి, సానుభూతి కాదు. తనకు సంబంధం లేకుండా జరిగినదానికి ప్రాణం తీస్కోబోవటం తెలివి తక్కువతనమని మందలించి, ధైర్యం నూరిపోయాలిగానీ, నువ్వే ఇలా డీలా పడిపోతే ఎలా" ఆ ఆప్యాయతకు, ఓదార్పుకు గుండె లోతుల్లో పొంగుతున్న కన్నీరు కట్టలు తెంచుకుని పొంగి పొర్లింది. చెట్టంత మనిషి తల్లి ముందు పసి పిల్లాడై వెక్కి వెక్కి ఏడ్చాడు.

"ఏంటి నాన్నా ఇది? చిన్న పిల్లాళ్ళా! లే కళ్ళుతుడుచుకో. ఓ రెండు నెలలు అనితనిక్కడే వుంచు. దానికి బాగా విశ్రాంతి, స్థలం మార్పు అవసరం" తల నిమురుతూ అంది. గుండెల్లో బరువు కన్నీళ్ళతో దింపుకున్న ప్రసాదరావు ఆ రాత్రి ఎన్నడూ లేనంత నిశ్చింతగా నిద్రపోయాడు.

మొదటి వారం రోజులూ అనితని బాగా గమనించింది కామేశ్వరమ్మ పెట్టింది తింటుంది. అలా

గంటల తరబడి కూచుని ఏదో ఆలోచిస్తూ వుంటుంది. ఆవిడ అసలు జరిగిన సంఘటన గురించి ప్రస్తావించదలచుకోలేదు. ఇలాగే వదిలివేస్తే లాభంలేదని నెమ్మది నెమ్మదిగా ఒక్కో పని అప్పజెప్పటం ప్రారంభించింది. "అనితా! వర్షమొచ్చేలా వుంది దొడ్లో బట్టలు తీస్కురావమ్మా ఇదిగో మహలక్షమ్మగారొచ్చారు కాస్త కాఫీ కలుపుకురా తల్లీ" మొదట్లో అనితకి కాఫీ కలపటం చేతనయ్యేది కాదు. "నేర్చుకుంటే అదే వస్తుంది" అంటూ నెమ్మదిగా ఒక్కో పని నేర్పటం మొదలుపెట్టింది. మధ్యాహ్నం పూట పక్క వీధి రమాదేవి ఇంటికి టైలరింగ్ నేర్చుకోవటానికి పంపేది. అనిత వచ్చి దాదాపు రెండు నెలలు కావస్తోంది. ముఖంలోకి కళ, ఒంటికి రంగు వచ్చాయి. కానీ ఆ కళ్ళల్లో ఇంకా దిగులు మాత్రం పోలేదు. చెప్పిన పనల్లా చేస్తుంది కానీ అందులో ఉత్సాహం వుండదు. గోధూళి వేళ, కామేశ్వరమ్మ సాయంత్రం వంటకు అరటికాయలు తరుగుతోంది. అనిత పక్కనే కూర్చుని సన్నజాజులు మాల కట్టడం నేర్చుకుంటోంది. "అనూ! కాలేజీలో ఎప్పుడు జాయినవుతావు" నానమ్మ మాటలకు చివ్వున తలెత్తింది. "డిగ్రీ అయిన తర్వాత ఏం చదవాలనుకుంటున్నావు"

"నేనింక చదవను నానమ్మా" తల వంచుకుని నెమ్మదిగా అంది.

"ఏం?"

"నాకిష్టం లేదు"

"చదవటం అంటే ఇష్టం లేదా? లేక కాలేజీకి పోవటం ఇష్టం లేదా?"

"నానమ్మా ఇంత జరిగాక నాకు అసలు చదువుమీదే ఇంట్రస్ట్ పోయింది. ఎలా మామూలుగా కాలేజీకి వెళ్ళను, ఎలా అందరితో మునుపట్లా మూవ్ అవను?" ఏడుపు ఆపుకుంటూ అంది అనిత.

"అమ్మడూ! నీకిలా జరిగిందని ఎంత మందికి తెలుసు. మీ నాన్న ఈ విషయం బయటికి రానీకుండా చాలా జాగ్రత్తలు తీస్కున్నాడు. నువ్వికా దేనికి భయపడాలి."

"నానమ్మా! నువ్విలా మాట్లాడుతూంటే ఆశ్చర్యం వేస్తూంది, నేనెంత పెద్ద దెబ్బతిన్నానో తెలుసుండీ. ఇంకా నన్ను మామూలుగా ఎలా ఉండ మంటావు? నువ్వే నా స్థానంలో వుంటే ఏం చేసేదానివి నానమ్మా?" ఉక్రోషంగా అడిగింది.

"శుభ్రంగా తలంటుకుని స్నానం చేసి, నా పన్లు నేను చేసుక్కునేదాన్ని. అనూ! నీ ప్రమేయం లేకుండా ఎవడో నీ శరీరాన్ని మలినం చేస్తే, ఆ తప్పు నీకు ఆపాదించుకుని జీవితాన్ని నాశనం చేసుక్కునేంత తెలివి తక్కువ పని చేస్తున్నావు. అది చాలా పొరపాటు తల్లీ"

"ఏం చెయ్యను నానమ్మా! ఎంత మర్చిపోదామన్నా మర్చిపోలేకుండా వున్నాను."

"జీవితానికి ఒక లక్ష్యం అంటూ ఉండాలి. దాన్ని మనసులో పెట్టుకుని నీ గమ్యానికి ప్రయాణం సాగిస్తే ఎన్ని అడ్డంకులొచ్చినా వెనుదిరగవు. నీ లక్ష్యాన్ని సాధించిన తర్వాత కలిగే తృప్తి ఈ ప్రపంచంలో ఏదీ నీకు ఇవ్వదు. నీకో రహస్యం చెప్పనా, మనిషి తన లక్ష్యం సాధించాకే జాగ్రత్తగా వుండాలి. తర్వాత సాధించడానికి ఏమీ ఉండక, నిస్పృహకి లోనవుతాడు. అందుకని ఎప్పటికప్పుడు ఏదో ఒక లక్ష్యం పెట్టుకుని జీవితంలో ముందుకు సాగాలి" తరిగిన అరటికాయ ముక్కలు నీళ్ళలో వేస్తూ అంది కామేశ్వరమ్మ.

"నానమ్మా! ఆడదానికి జీవితంలో చదువో, ఉద్యోగమో లక్ష్యం కాదుగా" నెమ్మదిగా అంది అనిత.

"అదీ, ఇప్పుడు నీ మనసులో మాట బయట పెట్టావు. అమ్మడూ, ఆడదానికి జీవితంలో పెళ్ళి ఒక భాగం. అంతే కానీ అదే జీవితంగాదు. నువ్వు ఎప్పుడో జరగబోయే దాన్ని గురించి ముందే ఊహించుకుని మనశ్శాంతి లేకుండా చేసుకుంటున్నావు. వీటన్నిటికీ చావే పరిష్కారమనుకుంటే అంతకంటే మూర్ఖత్వం ఇంకోటి లేదు" అంటూండగానే కసుక్కున చెయ్యి కోస్కుంది. రక్తం బొట బొటా కారటం మొదలుపెట్టింది. అను కంగారు పడి లోపలికి పరుగెత్తి దూది, గుడ్డముక్క పట్టు కొచ్చింది. కట్టు కట్టబోతున్న అనూని వారించి, "ఎందుకమ్మా? ఎలాగూ తెగింది. ఆ వేలును తీసేస్తే పోలా" అంటున్న నానమ్మ వైపు గాభరాగా చూస్తూ, "ఛ! ఏంటి నానమ్మా ఈ మాత్రం గాయానికి వేలు తీసేస్కుంటారా" అంది. "ఏం? శరీరంలో ఓ భాగం మలినమయితే నువ్వు ప్రాణం తీస్కోవాలనుకోగా లేంది ఈ వేలేపాటిది" నవ్వుతూ అంది.

ఆశ్చర్యంగా, విస్ఫారిత నేత్రాలతో చూస్తున్న మనమరాలిని దగ్గరకు తీస్కుని "అనూ! నువ్వింకా పసిపిల్లవే. మీరంతా పచ్చగా, ఆనందంగా మా ముందు తిరుగుతుంటే సంతోషంగా శేష జీవితాన్ని గడపవలసిన వాళ్ళం. అలాంటిది పసిమొగ్గలుగానే మీ జీవితాలు మా కళ్ళ ముందు వాడి, రాలిపోతుంటే అంతకంటే క్షోభ, కడుపు కోత ఇంకేమన్నా వుంటుందా? ఎందుకు మీ యువతరం పెడత్రోవపడుతోందో తెలుసా? లక్ష్యం అంటూ లేకపోవటం. కుటుంబంలో ఆరోగ్యకరమయిన వాతావరణం లేకపోవటం. మీ చదువులపై కంటే కూడా పక్క విషయాలపై అనవసరమైన ఆసక్తి చూపడం. చదువుకునే వయసులో రాజకీయపరంగా వాడుకోబడి బంద్‌లనీ, స్ట్రైకులనీ కాలాన్నీ వ్యర్థం చేసుకుంటారు. అనవసరపు ఆర్భాటాలూ ఆడంబరాలకుపోయి నాగరికత పేరిట తల్లిదండ్రులిచ్చిన స్వేచ్ఛని దుర్వినియోగం చేసుకుంటున్నారు. అమ్మడూ నీకు జరిగిన అన్యాయంలో నీ తల్లిదండ్రుల పాత్ర తప్పకుండా వుంది. స్త్రీకి స్వేచ్ఛ అవసరమే కాదన్ను. కానీ మనదేశంలో అర్ధరాత్రి తిరగటానికి మగవాళ్ళే భయపడేంతటి పరిస్థితులు. అలాంటప్పుడు ఆడపిల్లవి, నిన్ను అంత విచ్చల విడిగా పార్టీలంటూ అర్ధరాత్రిదాకా తిరగనివ్వటం వాళ్ళ తప్పు. ఒక వయసు వచ్చాక తల్లితండ్రులు పిల్లలతో స్నేహంగా వుంటూ, వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దటానికి కృషి చెయ్యాలి. అది వాళ్ళ కనీస బాధ్యత. దురదృష్టం, చిన్నప్పట్నించి నువ్వు అలాంటి వాతావరణంలో పెరగలేదు. ఇలా అంటున్నానని తప్పంతా వాళ్ళ మీదకు తోసి వాళ్ళను దోషులను చెయ్యకు. నీకూ ఏది తప్పో ఏది ఒప్పో తెలుసుకునే వయసు వచ్చింది. నీ జాగ్రత్తలో నువ్వుండాలి. ప్రతి జీవితానికీ ఓ పరమార్థం వుంటుంది. ఆత్మహత్య పిరికి వాళ్ళ లక్షణం. నీలాంటి వాళ్ళు ఈ దేశంలో కోకొల్లలు. బయటికి చెప్పుకోలేకా, చెప్పుకుంటే న్యాయం జరక్కపోగా అవమానాల పాలయి కుమిలి కుమిలి చివరకు ఆత్మహత్య చేసుకునే వారు ఈ దేశంలో చాలా మందే వుంటారు. నువ్వు వాళ్ళల్లో ఒకదానివి కాదు, కాకూడదు. ఇక్కడ సానుభూతి కాదు కావలసింది. చేయూత, ధైర్యం. అందుకు నీలాంటి వాళ్ళే ముందుకు రావాలి. వాళ్ళకి బ్రతుకు మీద ఆశని రేకెత్తించాలి. దానికి ముందుగా నీ జీవితాన్ని అందంగా ఆదర్శవంతంగా మలచుకో. అప్పుడర్థమవుతుంది జీవితమంటే ఏమిటో, దాన్ని ఆనందంగా అనుభవించటంలో వున్న మాధుర్యమేమిటో. ఈ నానమ్మ ఇంతకంటే నీకు చెప్పేది ఏమీ లేదు" అంటూ అనిత భుజం తట్టి వంటింట్లోకి నడిచింది కామేశ్వరమ్మ.

"నిజమే నానమ్మ ఎంత బాగా చెప్పింది" అనిత మొట్ట మొదటిసారిగా తన సమస్యను మరో కోణంలో ఆలోచించటం మొదలుపెట్టింది. "తన తప్పేముందని తన జీవితం నాశనం చేసుకోవాలి. నానమ్మ చెప్పినట్లు తను భావీ జీవితం గురించి ఏదో ఊహించుకుని భయపడుతోంది. ఎంత సిల్లీ? తనను తను గా మెచ్చినవాడు. తనలోని టాలెంట్స్‌ను గుర్తించినవాడ్నే చేస్కుంటుంది. లేకపోతే అస్సలు పెళ్ళే ఒద్దు. అమ్మ, నాన్న, నానమ్మ వీళ్ళందర్నీ విడిచి ప్రాణం తీస్కోవాలనుకోవటం ఎంత మూర్ఖత్వం."

ఈ ఆలోచనలతో జీవితం మీద తీపి, ఏదో సాధించాలన్న తపన ఆమెలో మొదలయ్యాయి. గుండె నిండా ధైర్యంతో, చైతన్యం మూర్తీభవించిన నానమ్మ ఆశీర్వచనంతో జీవిత సమరానికి నడుం కట్టింది అనిత. ☆

## వర్షం!

ఆకాశానికింకా... తెలవారినట్లులేదు...
అన్నం వార్చటానికి...
పుడమితల్లి... ఎదురు చూస్తోంది...
నకనకలాడుతున్న...
బిడ్డల ఆకలి తీర్చటానికి...
మిన్నువార్చే... గంజికోసం...

– యలమాటి అనసూయ